శ్రీ కొవ్విడి రామం, బి. ఏ. బి. ఎల్.



# రాధ

చవిగలపలుకు, చక్కని రూపుగల ఆ గొల్లభామను "రాధ" అని అందరూ పిలుస్తారు విజ్ఞానము, విలాసము కూడా జట్టు కట్టుకుని ఆమెలోనే లీనమైపోవడంచేత, తల నెరిసిన కులపెద్దలుకూడా, గ్రామంలో జాతరలు, సంబరాలు అవీ జరిపినప్పుడు, ఆమె సలహా తీసుకునేవారు కౌముదిలోని చల్లదనం, రోజాపువ్వులోని పరిమళం, నవనీతంలోని మార్దవం, అన్నీ ఒకేదగ్గర కరడుకట్టుకుని వుండటం అసంభవమే! ఒకవేళ అలాగే కలిసివుంటే యెంత హాయిగా వుంటుందని! మానవస్వభావాన్ని గుర్తించినవారు యెవరు, లేశమూ కల్మషంలేకుండా, మంచిగుణాలన్నీ ఒకే మనిషిలో మూర్తీభవించి వుంటాయని భ్రమపడరు. కాని రాధనుగురించి ఆలోచించినప్పుడుమాత్రం యీ విషయమై అభిప్రాయాలు మార్చుకోవాలేమో అనిపిస్తుంది ఆమె యెక్కడవుంటే అక్కడ శాంతి, సౌఖ్యము తాండవించేవి తోడి పల్లె పడుచులతో యమునకు నీళ్ళకు పోయినప్పుడు, నవ్వుతూ, కేరుతూ రాధ యేవో భావాలు స్ఫురించేటట్టు సవిలాసంగా మాట్లాడేది. ఆమెలాగే వారు కూడా ఛలోక్తులను ప్రయోగించబోయి పాపం! తబ్బిబ్బు పడేవారు సాయంత్రం నదిఒడ్డున పిచుకగూళ్లు కట్టుమనీ, ఒప్పుల కుప్పలు తిప్పమనీ ఆటపిల్లలంతా ఆమెను బతిమాలేవారు.

రాధ చాలా తెలివైనపిల్ల అయితే సూత్రాలు వల్లెవేసి గుక్కతిప్పకుండా శంకా సమాధానాలుచెప్పే చాతుర్యం ఆమెలో లేదు కాని ఒదినా మరదళ్ళకుగాని, అత్తా కోడళ్ళకుగాని, మనస్పర్ధలుగలిగి కలతపడుతూవుంటే, తియ్యని మాటలతోనూ, తలకెక్కే సబబులతోనూ రాధ వారికి రాజీచేసేది కమ్మని పెరుగు తోడుపెట్టడంలోనూ చల్ల చిలికి చక్కగా వెన్నతియ్యడంలోనూ, ఆమెది అందెవేసిన చెయ్యి పాడి పశువులను పెంచి సంరక్షణ చెయ్యడంలో ఆమె ప్రత్యేక నైపుణ్యం ప్రదర్శించేది చిన్నపిల్లలతో ఆడుకున్నట్టే, ఆమె లేగదూడలతోనూ, మేకపిల్లలతోనూ, ఆడుకునేది. ఎంత పోట్లగొడ్డయినా, ఆమె కరస్పర్శ తగలగానే, మచ్చిక అయిపోయి అతి సాధువుగా ప్రవర్తించేది "అంబా" అని అరుస్తూ 'ఛంగు' 'ఛంగు'న తల్లి పొదుగు దగ్గరకు పారిపోయే లేగదూడకూడా ఆమెకు అమితమైన ఆనందాన్ని చేకూర్చేవి.

తాచుపామువంటి జడను, పాము పొరవంటి పైట చరగులో దాచుకుని, రాధ ఆనాటి సాయంత్రం ఒంటరిగా నదిఒడ్డునుంచే మెల్లిగా నడుస్తున్నది. ఆమె లేత పాదాల ముద్ర ఒడ్డున స్పష్టంగా అంకితమైవుంది. కొన్ని పిల్ల కెరటాలు ఆమె పాదాలదగ్గరకువచ్చి, బెదిరి వెనక్కితిరిగి చెదిరిపోయేవి కొంతదూరం నడచిన తరువాత, రాధకు దూరంనుంచీ శ్రవణపేయమైన గానం వినిపించింది. అటు వైపే ఆమె ప్రయాణాన్ని సాగించింది. అది కృష్ణుని మధురతమమైన వేణుగానం గోప గోపీ జనమంతా తన్మయత్వంతో ఆ పాటని వింటున్నారు. ఆ మంజులమురళీరవళి రాధ హృదయతంత్రులను స్పందించి, ఆమెలో వినూత్నమైన చైతన్యాన్ని కలిగించింది. రాగసంచారంలో కృష్ణుడు ఒక స్థాయినుంచి మరొకస్థాయికిపోతూ, అమృతసోపానాలపైన విహరిస్తూవుంటే, ఆమెకూడా భావప్రపంచంలో అతన్నే అనుసరిస్తోంది నిజంగా ఆ సమయంలో, ఆమె బాహ్య శరీరానికి ఆమెకు యేవిధమైన సంబంధమూలేనట్టే వుంది "వెదురుగొట్టంలో ఊపిరిపోసి యెంత వింత చూపెట్టేడు కృష్ణుడు" అని ఆమె అబ్బురపడింది. ఇదివరకల్లా ఆమె క్రీడగా, వినోదంకోసం, లలితకళలను అభ్యసించేది ఆనాడు కృష్ణుడు గానకళను ఉపాసించి, అనంతమైన ఆదిజ్యోతికి ద్వారిచూపేడు బ్రహ్మస్వరూపంలోవుండే మహదానందాన్నే రుచిచూపించేడు. ఇదివరకు రాధ యెన్నో పాటలువింది తానే యెన్నో గేయాల్ని ఆలపించింది. కాని అవివేరు ఇదివేరు ఈ విషయం తల్చుకున్నప్పుడల్లా ఆమె శరీరం పులకరించేది

కొంతసేపటికి రాధ తిరిగీ యీలోకంలో పడింది. ఆమె యిల్లుచేరుకునేసరికి చాలా పొద్దుపోయింది. మర్నాడు ఉదయం పరిస్థితులన్నీ ఆమెకు తారుమారుగా కనిపించేయి ఇదివరకు సరదాగా ఆమెతో కలిసి మెలిసివున్న సహచరులంతా యిప్పుడు ఆమెతో మాట్లాడడమే మానేసేరు పైగా వారు కాకిమీదపెట్టీ, పిచ్చికమీదపెట్టీ, వేళాకోళాలు, యెత్తి పొడుపులు ప్రారంభించేరు దూరంగాపోయి వారిలోవారు యేవో గుస, గుస లాడేవారు ఇంటి దగ్గర అప్పులుకూడా పెడమొగంపెట్టి రాధను పలకరించడమే మానేసేరు ఈ విచిత్రమైన వైఖరి ఆమెకు అగమ్యగోచరంగా వుండేది ఆఖరికి పుకారు క్రమంగా వృద్ధిపొంది ఆమె చెవిదాకా వచ్చింది ఒక్కతే రాత్రి యమునవద్దకు వెళ్ళి చాలాసేపటివరకూ వుండడం, ఆసమయంలో కృష్ణుడుకూడా అక్కడకు రావడం, అమ్మలక్కల పుకారుకు కావలసిన కథావస్తువును సమకూర్చేయి "ఇల్లుఒదిలి ఒంటరిగా రాత్రి యమునకుపోయే ఆడదాని సాహసం" అంటూ చిలవలూ పలవలూ కల్పించి, కథలు అల్లేరు గ్రామవాసులు ఈ అపవాదు వినేసరికల్లా రాధకు భరింపరాని మనోవేదన కలిగింది - భవయాతన అంతా ఒక్కసారి ఆమెను ముట్టడించినట్టయింది ఇంతవరకూ భావ ప్రపంచంలో ఆమె కట్టిన గాలిమేడలన్నీ ఒక్క వేటుతో నేలకూలిపోయినాయి అపవాదు యెంత బాధపెడుతుంది! చిచ్చు చనిపోయినవారిని దహిస్తుంది అపవాదు బతికివున్న వాళ్ళనే! - అబ్బా! తామరరేకులవంటి ఆమెకళ్లు వేడి నీళ్ళతోనిండి ఒరిసిపోయినాయి వేడి నిట్టూర్పుతో గుండె కమిలిపోయింది.

ఇదివరకు కళోపాసనతో రాధ ఆనందమయమైన జీవితాన్ని గడిపింది. జీవితమంటే ప్రేమగానంవంటిదని ఆమె భ్రమపడింది. కాని జీవితనాటకంలోవుండే విషాదం ఆమెకిప్పుడు అనుభూతమైంది. "ఇంతలో యెంత పాడుపని చేసేరు" అని ఆమె నివ్వెరపడింది. "లోకం పాపిష్ఠిది" అని యింకా యేమో తనలో గొణుక్కుంది కాని ఆమెను యెవరు ఓదారుస్తారు? ఎందుకు ఓదారుస్తారు ఆమె అంతట ఆమే ఊరడిల్లింది కర్తవ్యం ఆలోచించబోగా శూన్యమే ఆమెకు గోచరించింది కృష్ణుడు ఆపద్బాంధవుడు, అతని వద్దకుపోతే శాంతి కలుగుతుందేమోనని ఆమె అంతరాత్మ ప్రబోధించింది "అక్కడకు పోతేనేగదూ యీతగువంతా వచ్చింది?" అని మనస్సు వెనక్కులాగింది. గాలివానకు చెలరేగిన సముద్రతరంగాలలాగే ఆమె మనస్సు తల్లడిల్లిపోతోంది. ఎలాగో ధైర్యంవహించి, నదివైపు వెళ్ళిపోయి

> స్టూడెంటు — స్టూడెంట్సుకి ఫేషనుగావుండే బట్టలున్నాయా?
>
> షాపువాడు — ఆడుకోడానికి ఉపయోగించేవా, చదువుకోడానికి ఉపయోగించేవా?

ఒక తిన్నెపైన ఒంటరిగా ఆమె కూర్చుంది ఎక్కడ నుంచో వచ్చి కృష్ణుడు ఆమె వెనకనే నిలబడ్డాడు. కాని ఆందోళనలో ఆమె అతన్ని గమనించలేదు కృష్ణుడు చిన్న పాట పాడేడు రాధ తుళ్ళిపడి వెనక్కిచూసింది. ఆ జగన్మోహనాకారం ఆమెకంటపడగా బాధ కొంత ఉపశమించిందిగాని, ఆ మరుచటి క్షణంలోనే పల్లెపడుచుల వేళాకోళాలు స్ఫురణకువచ్చి, ఆమె వెక్కి వెక్కి యేడ్చింది.

కృష్ణుడు — నువ్వేమో ప్రౌఢవనుకున్నాను రాధా! ఇంత బేలవై పోయినావేం?

రాధ — "మంచి చేయబోతే చెడ్డ యెదురుగా వచ్చిందిట! కళా తపస్సుతో మోక్షాన్ని సాధిద్దామనుకున్నాను. ఈ పాపిష్ఠిలోకం ఆ తపస్సును భగ్నంచేసి, నాకు వ్యభిచారదోషాన్నికూడా అంటగట్టింది వారిదృష్టిలో నేను పతితను అయ్యో! నాకు తరుణోపాయంలేదూ!" అని ఆమె తలవంచుకుంది.

కృష్ణుడు — లేకేం రాధా! కళకు ఆస్పదం సృష్టే కదూ! లోకమే పాపిష్టిదైతే, కళారాధనకు తావెక్కడ వుంటుంది? లోకాన్ని బహిష్కరించి, కళారాధనకు పూనుకోవడం నేలవిడిచి సాముచేయడంవంటిదికదూ?

రాధ — నేనూ ఒకప్పుడలాగే భ్రమపడ్డాను - నీకు లోకులసంగతి తెలియదు నన్ను అమాయకురాల్నిచేసి, చెరగని మచ్చనివారు నాకు అంటించేరు నా పరిస్థితే నీకు తెలిస్తే నీది ఉక్కుకన్న కఠినమైన గుండె అయినా నీరైనా వేడి కన్నీళ్ళతో కలిసి ప్రవహిస్తుంది మానంకంచే రక్షణీయమైనది స్త్రీకి యింకొకటి లేదు - దానికే కళంకం వస్తే యిక ఎలాగ భరించడం?

కృష్ణుడు — చూడు! రాధా! ఆ గులాబిమొక్కకింద బురద బూడిద అవీ యెంత అసహ్యంగావున్నాయో? మీద కొన్ని వాడిన ఆకులు యెండిన కొమ్మలుకూడా వున్నాయి - కాని ఆ కొమ్మల చివర చక్కగా వికసించిన పువ్వు గండుతుమ్మెదతో యెలాగ ఆడుకుంటున్నాదో చూశావా? ఆ పువ్వు పెరగడానికి యీ ముళ్లకొమ్మలు, ఆ బురదలో జొచ్చుకుపోయిన వేళ్లూ అన్నీ అవసరమే

కదూ! అవే లేకపోతే పువ్వెక్కడవుంటుంది? మొక్క అడుగునవున్న బురదలాగే, లోకంలో యెందరో నీచులు, యెన్నో రకాలవాళ్లూ వున్నారు కొమ్మ కొనసున్న వాసన గల పువ్వులాగే పరిణితిని అభిలషించి, విజ్ఞానాన్ని సంపాదించే నీవంటివారు కోటికీ ఒకరువుంటారు. మంచికి చెడ్డకీ లోకమేస్థానం లోకంలో పశుప్రవృత్తివున్నంత మాత్రాన అది పరిత్యాజ్యంకాగూడదని యిదివరకేచెప్పేను కదూ! మరొకమాట. అగ్నిపరీక్షకు నిలిచిన బంగారమే సిసలైనదని అందరూ ఒప్పుకుంటారు అలాగే యిక్కడ కష్టనిష్ఠురాల్ని ధైర్యంగా యెదుర్కొని ఆశయాల్ని సాధించినవాళ్ళే ధీరులు. కళా రాధకులుకూడా లోకపోకడని జాగ్రతగా గమనిస్తారు కాని లోకంలోవున్న మకిలిని మాత్రం వారు అంటించుకోరు

రాధ —అది యెలాగ సాధ్యమౌతుంది?

కృష్ణుడు —అభ్యాసయోగంవల్ల - నీ కర్మలో నువ్వు ఆనందాన్ని అనుభవించి, త్రికర్ణశుద్ధిగా, ఫలాపేక్షరహితంగా, లోకసేవ చేయగలిగినప్పుడు

రాధ కొంతసేపు మౌనంగా నేలవేపుచూస్తూ నిలబడింది

కృష్ణుడు —ఇంకా యేదో సంశయం వుందికదూ.

రాధ —ఆనాడు నీ మురళీవాద్యంలో యేదో విశిష్టమైన ప్రభావం వ్యక్తమయింది ఋషులు కోరుకునే మోక్షానికే ఆ పాట తోవచూపినట్టుంది నేనే ఆపాటనైతే యెంత హాయిగా వుండును!

కృష్ణుడు —వినగలిగితే నా మురళీనాదం లోకమంతటా యెప్పుడూ వినపడుతూనే వుంటుంది నీ కళాకాంక్షకు భంగం కలగనీయను నువ్వు ఆశించే ముక్తికూడా కళారాధనవల్లనే సిద్ధిస్తుంది.

ఈమాట చెవిని పడగానే రాధ మనస్సు కొంత శాంతించింది వాన వెలిసిన తరువాత మబ్బు తెరచాటునుంచి నేలవంక తొంగిచూసినట్టే బాష్పసిక్తమైన ఆమె ముఖంలో మొలక నవ్వు వ్యక్తమయింది ఆమె తలవంచి, చేతులు జోడించి, కృష్ణుడికి నమస్కారంచేసి, మెల్లిగా వెళుతోంది ఆమెను దిగబెట్టడానికే కాబోలు యమునానది కూడా ఆపక్కనుంచే మెల్లిగా సాగిపోతోంది వెనకనుంచీ మధురతమమైన వేణుగానం రాధ చెవులో పడుతోంది నదిపైనుంచి వచ్చే పిల్లగాలులు చెట్లకొమ్మలను పలకరించుకుంటూ, చక్కగా ఆగానానికి శృతివేస్తున్నాయి.

# సిగ్గు

పూర్వం ఒక రాజు ఉండేవాడు కింది వుద్యోగుల చెడ్డ సలహాలు విని అతడనేక గ్రామములను ధ్వంసము చేస్తుండేవాడు.

అతని కొక తెలివైనమంత్రి ఉండేవాడు. ఒక నాడు వీరిద్దరు షికారు వెళ్లుతుండగా దారిలో ఒక చెట్టుమీద రెండు పక్షులు మాట్లాడుకొంటున్నాయి.

"అవిదేనినిగురించి మాట్లాడుతున్నాయోయ్?" అని రాజు మంత్రినడిగాడు

"పెళ్ళి బేరములాడుతున్నాయి ప్రభూ " అని మంత్రి బదులు చెప్పేడు

"ఏమిటా పెళ్ళి బేరాలు?" అని రాజు తిరిగి అడిగాడు.

దానికి మంత్రి ఇలా జవాబుచెప్పాడు — ప్రభూ! మగపక్షి ఆడపక్షితో ఇలా చెప్పింది "నువ్వు నాకు 100 పాడుగ్రామములు కట్నమిస్తేగాని నా కొడుకుని నీ కూతురుకిచ్చి పెళ్ళి చేయను" అని అన్నది.

దాని కాడపక్షి ఇలా అంటున్నది 100 ఖర్మ మేమి మనరాజుగారి దయవుంటే 1000 గ్రామములిస్తాను—

ఆ మాటకు రాజు సిగ్గుతో తల వంచుకొని అప్పటినుంచి గ్రామములను కాల్చుట మానేశాడు.

—బచ్చులక్ష్మీ నరసింహారావు.